సాక్షి

వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 26 । నవంబర్ । 2023



క్రికెట్ మ్యాచ్‌లు షురూ

ఏసీఏ అండర్–23 అంతర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు శనివారం కడపలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాల్లో ప్రారంభమయ్యాయి.

-8లో



పరిమితికి మించి తరలించొద్దు

ఆటోలో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు.

-8లో

గరిష్ఠం/కనిష్ఠం

35.0/24.2

వాతావరణం

జిల్లాలో శనివారం 24.2 – 35.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

12న జెడ్పీ సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం డిసెంబరు 12వ తేదీ ఉదయం 10 గంటలకు కడపలో నిర్వహిస్తున్నామని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, రెండు జిల్లాల అధికారులు హాజరు కావాలన్నారు. జిల్లాలో ఆయా శాఖల్లో జరుగుతున్న ప్రగతిపై నివేదికలతో అధికారులు రావాలని సూచించారు.

27న కౌన్సెలింగ్

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో ఈ నెల 27వ తేదీన కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామక కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. జోన్–4 (రాయలసీమ జిల్లాలు)లో 95 స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (ఐటీఐ సర్కిల్‌కు సమీపంలో) కార్యాలయం మీటింగ్ హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి జరిగే కౌన్సెలింగ్‌కు స్టాఫ్ నర్స్‌గా ఎంపికైన అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు.

నేడు, రేపు చిత్రకళా ప్రదర్శన

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని జీఎంసీ కళ్యాణ మండపంలో ఆది, సోమవారాల్లో రాజంపేట పట్టణం బోయపాళెంకు చెందిన నాయని గిరిధర్ వేసిన చిత్రాలను ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ రామకృష్ణారెడ్డి, డీఎస్పీ చైతన్యలతో కలిసి చిత్ర కళాప్రదర్శనను ప్రారంభిస్తారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్‌లో 30 రోజులు, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో 30 రోజులు గ్రామీణ ప్రాంత మహిళలకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఇతర వివరాలకు 9440 905478, 63028 33546 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఐటీఐలో ఉచిత శిక్షణ కోర్సులు

కడప ఎడ్యుకేషన్: కడప కాగితాలపెంటలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన –4 పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉచితంగా ఎలక్ట్రికల్ డొమెస్టిక్ సొల్యూషన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్(కంప్యూటర్), పిట్టర్ ప్రాబ్రికేషన్ కోర్సుల శిక్షణను డిసెంబర్‌లో ప్రారంభించనున్నట్లు డీఎల్‌టీసీ ఐటీఐ అసిస్టెండ్ డైరెక్టర్ రత్నరాజు తెలిపారు. వివరాలకు 9000366621, 9505965504 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

కడపలో సర్వే విమానం చక్కర్లు

కడప సిటీ: కడప పరిసర ప్రాంతాల్లో ఆకాశమార్గాన శనివారం రాత్రి సర్వే విమానం చక్కర్లు కొట్టింది. సాయంత్రం చెన్నై నుంచి ఈ సర్వే విమానం 6 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. అప్పటి నుంచి గంటపాటు రాత్రి పూట ఈ విమానం కడప నగరంలో చక్కర్లు కొట్టింది. ప్రస్తుతం కడప ఎయిర్‌పోర్టులో నైట్ ల్యాండింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విమానాలు రాత్రి పూట రాకపోకలు సాగించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విమానాలు నైట్ ల్యాండింగ్‌కు సర్వే ఫ్లైట్ చక్కర్లు కొట్టినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. అంతేకాకుండా కొత్త ఎక్విప్‌మెంట్ ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసే సందర్భంలో కూడా ఇలాంటి సర్వే విమానాలు నడిపి అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుంది.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

కడప సెవెన్‌రోడ్స్: జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శనివారం చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి పలు అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. చీఫ్ సెక్రటరీ సూచనలు, ఆదేశాల మేరకు జిల్లాలో అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందించాలన్నారు. రీ సర్వే పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ, భూ రికార్డుల స్వచ్ఛీకరణ పనులు వేగవంతం చేయాలన్నారు.

పెద్ద ఉరుసు ప్రారంభం

- ఆధ్యాత్మిక శిఖరంగా వెలుగొందుతున్న అమీన్‌పీర్ దర్గా
- నేటి నుంచి ఉరుసు ఉత్సవాల నిర్వహణ
- ప్రభుత్వం తరుపున చాదర్ సమర్పించనున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



విద్యుద్దీపాల వెలుగులో దర్గా ప్రాంగణం

కడప కల్చరల్: దేశంలో ఎన్నో ఆధ్యాత్మిక క్షేత్రాలు ఉన్నాయి. వాటిలో ఇస్లాం సూఫీ తత్వాన్ని బోధిస్తూ కులమతాలకు అతీతంగా ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంచుతూ మానవత్వానికే పెద్దపీట వేస్తున్న కడప అమీన్‌పీర్ దర్గాకు విశిష్టమైన పేరుంది. దీనిని దక్షిణ భారత అజ్మీర్‌గా కూడా కొనియాడుతారు. సామాన్య మానవుడి నుంచి అత్యున్నత స్థాయి రాజకీయ, సినీ ప్రముఖులు ఒకేస్థాయిలో స్వేచ్ఛగా ప్రార్థనలు చేసుకోగలిగిన వాతావరణంగల ఈ క్షేత్రం నిరంతరం భక్తులతో కళకళలాడుతూ ఉంటుంది. శాంతియుత సూఫీ తత్వాన్ని ప్రబోధిస్తున్న ఈ దర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు ఈనెల 26, 27, 28 తేదీల్లో నిర్వహిస్తారు. మరో పది రోజులపాటు ఉత్సవాలు కొనసాగుతాయి.

గురువుల చరిత్ర

16వ శతాబ్దంలో కర్ణాటకలోని బీదర్ ప్రాంతం నుంచి మహా ప్రవక్త (సా.అ.వ) వంశీయులైన ఖ్వాజాయే ఖాజుగా నాయబె రసూల్ అతాయే రసూలుల్లాహ్ హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా పీరుల్లామాలిక్ సాహెబ్ తన సతీమణి కుమారుడు హజరత్ ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్, హజరత్ అహ్మద్ హుసేనీ సాహెబ్‌లతో పాటు భక్తగణంతో ఈ ప్రాంతానికి వచ్చారు. ఆధ్యాత్మిక బోధనలతో అందరినీ ఆకట్టుకున్నారు. నాటి నవాబులు వీరి మహిమలను గమనించిప్రియ భక్తులు అయ్యారు. వారి కోరిక మేరకు గురువులు కడప నగరంలో స్థిరపడ్డారు.

మహాతపస్వి

దర్గా వ్యవస్థాపకులు హజరత్ సయ్యద్‌షా పీరుల్లా మాలిక్ అయినా పెద్ద ఉరుసు మాత్రం సూఫీ సర్ మస్తాని ఆరీఫుల్లా మహమమ్మద్ మహ్మదుల్ హుసేనీ సాహెబ్ పేరిటే జరుగుతుంది. ఆయన 40 సంవత్సరాలపాటు తాడిపత్రి అటవీ గుహల్లో, 23 సంవత్సరాలపాటు కడప శేషాచల అడవుల్లో తపస్సు చేశారు. దానికి ప్రతీకగా దర్గాలో ఆయన మజార్ మిగతా వాటి కంటే కాస్త ఎక్కువ ఏర్పాటు చేశారు. భక్తులు తొలుత హజరత్ పీరుల్లా మాలిక్ మజార్‌ను దర్శించుకున్న తర్వాతే హజరత్ ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్, అమీనుల్లా హుసేనీ సాహెబ్‌మజార్లను కూడా దర్శించుకుంటారు. హజరత్ అమీనుల్లా హుసేనీ సాహెబ్ 10వ పీఠాధిపతిగా వ్యవహరించారు. ఆధ్యాత్మికంగానే కాకుండా ప్రేమ, దయ, మానవతా గుణం ఎక్కువగా ఉండడంతో ఆయనను అభిమానించేవారు ఎక్కువయ్యారు. పలువురు భక్తులు ఆయన పేరుతోనే దర్గాను అమీన్‌పీర్ సాహెబ్ దర్గాగా పేర్కొనేవారు. కాలక్రమంలో అది అమీన్‌పీర్ దర్గాగా మారింది.

11వ పీఠాధిపతి



ప్రస్తుతం దర్గా 11వ పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ నిర్వహణలో ఉంది. దర్గాలో మొత్తం గురువులు, వారి వారసుల పేరిట ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం ఏటా మొత్తం 11 చిన్న ఉరుసులు, గంధం ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రస్తుతం పెద్ద ఉరుసును వారం రోజులపాటు అత్యంత వైభవంగా జరుగుతుంది. దేశం నలుమూలల నుంచి లక్షలాది భక్తులు హాజరవుతారు. ఉరుసు ముగిశాక పదిరోజుల వరకు సందడి కొనసాగుతుంది.

సర్వమత సమానత


ఈసారి ఉరుసును విలక్షణమైన రీతిలో నిర్వహించనున్నారు. పీఠాధిపతి ఆదేశం మేరకు దర్గా సమీపంలోని దాదాపు 10 హిందూ దేవాలయాలు, మూడు చర్చిలు, మరికొన్ని మసీదులు, హిందూ, ముస్లిం శ్మశాన వాటికలను కూడా సుందరీకరించి ఉత్సవ వాతావరణం ఉట్టిపడేలా అలంకరిస్తున్నారు. ముస్లిం గురువు పేరిట ఉత్సవాలు జరుగుతున్నా అన్ని మతాల వారు ఆనందంగా గడపాలన్నదే పీఠాధిపతి ఉద్దేశం. ఉరుసు రోజున ప్రభుత్వం పక్షాన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ఇతర అధికారులతో కలిసి చాదర్‌ను తీసుకొచ్చి సమర్పించనున్నారు.

ఉరుసు వివరాలు

హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ చిష్టివుల్ ఖాద్రి సాహెబ్ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26న గంధం, 27న ఉరుసు ఉత్సవం, 28 తహలీల్ ఫాతెహా, అఖిల భారత కవి సమ్మేళనం, 29న ఖవ్వాలీ కచేరీ నిర్వహిస్తారు. 30న అశేష భక్తుల సమక్షంలో నిర్వహించే పీఠాధిపతి ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

బెలూన్ ఆవిష్కరణ

కడప కల్చరల్: ఈ ఏడాది జరగనున్న పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, జిల్లా అధికారులు దీనికి ఎంతో సహకరిస్తున్నారని, జయప్రదం చేసే బాధ్యత అందరిపై ఉందని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. శనివారం దర్గా ప్రాంగణంలో ఆయన ఉరుసు ప్రారంభ సూచనగా బెలూన్‌ను ఎగుర వేశారు. అనంతరం మాట్లాడుతూ అమీన్ పీర్ దర్గా ఉరుసును జిల్లాలో ఘనంగా నిర్వహించడం జరుగుతోందని, దీనిని జిల్లా పండుగగా భావిస్తున్నామన్నారు. ఉత్సవాలలో చిన్నారులు కూడా పాల్గొనేలా పాఠశాలలకు సెలవు ఇవ్వనున్నట్లు తెలిపారు.ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గంధం, సోమవారం ఉరుసు ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం తరపున చాదర్ ను కూడా సమర్పించనున్నట్లు, ఇందులో జిల్లా అధికారులు కూడా పాల్గొంటారని తెలిపారు. ఈనెల 30న నగరంలో పీఠాధిపతి ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్ఏ కరీముల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు అఫ్జల్ ఖాన్, కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, అక్బర్, చాక్లెట్ గౌస్, దర్గా మేనేజర్ మహమ్మద్ అలీఖాన్, కుతుబుద్దీన్, ముజావర్ అమీర్‌బాషా, దర్గా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బెలూన్‌ను ఎగుర వేస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

నవ్వి‌పోదురు గాక..

- గల్లీలో టీడీపీ.. ఢిల్లీలో బీజేపీ
- సీఎం రమేష్ తీరుతో విస్తుపోతున్న బీజేపీ నేతలు





సాక్షి ప్రతినిధి, కడప: రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీలో చేరిన టీడీపీ నేతలు సిగ్గు విడిచి ప్రవర్తిస్తున్నారు. విలువల్లేని రాజకీయాలు చేస్తూ నవ్వుల పాలవుతున్నారు. నవ్విపోదురుగాక...నాకేటి సిగ్గు అన్నట్లుగా కడప గల్లీలో టీడీపీ..ఢిల్లీలో బీజేపీ నేతగా చెలామణి అవుతున్నారు. రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ వ్యవహరిస్తున్న ధోరణితో ఇటు టీడీపీ, అటు బీజేపీ నాయకులు సైతం విస్తుపోతున్నారు. స్వప్రయోజనాలే పరమావధిగా కొనసాగేవారికి సీఎం రమేష్ నిదర్శనంగా నిలుస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు.

బీటెక్ రవి వ్యవహారంలో..

పులివెందుల టీడీపీ నేత బీటెక్ రవిని ఓ కేసులో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌లో పెట్టారు. ఇటీవల పరామర్శించిన బీజేపీ ఎంపీ రమేష్‌నాయుడు బీటెక్ రవిని పోలీసులు కిడ్నాప్ చేశారని, మీడియా వల్లే బతికిపోయారని చెబుతూనే పోలీసులు హింసించారని కూడా ఆరోపించారు. ఈ విషయమై ఎస్పీ సిద్ధార్థ కౌశల్ స్పందిస్తూ బీటెక్ రవిని 7.30 గంటలకు అరెస్టు చేస్తే, లీగల్ ఫార్మాలిటీస్ పూర్తి చేసి 10.30 గంటలకు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చామన్నారు. 24గంటల్లో హాజరు పెట్టాల్సి ఉండగా తక్షణ నిర్ణయం తీసుకున్నామని వివరిస్తూనే, పోలీసులపై తప్పుడు ఆరోపణలు తగవని..చట్టపరిధిలోనే చర్యలు చేపట్టినట్లు వివరించారు. అయితే ఇదే విషయమై శనివారం ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ ఎస్పీకి తీరు సరిగా లేదంటూ హితబోధ చేశారు. కాగా జిల్లాలో బీజేపీ నేతలను ఏనాడూ పెద్దగా పట్టించుకోని సీఎం రమేష్ టీడీపీ నేత బీటెక్ రవి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపడాన్ని పలువురు ఆశ్చర్యచకితులవుతున్నారు.

టీడీపీకి కూడా తానే పెద్ద!

బీటెక్ రవిని పోలీసులు హింసించి ఉంటే మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చేవాడు కదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.అవకాశమొస్తే పోలీసులను వదిలిపెడతాడా అంటున్నారు. అయి తే ఎంపీ రమేష్ జిల్లాలో టీడీపీకి తాను మాత్రమే పెద్దదిక్కు అన్నటు చెప్పుకోవడాని కే ఈ వ్యవహారాన్ని వి వాదస్పదం చేసినట్లు విశ్లేషకులు అంటున్నా రు.పైగా ఎంపీ రమేష్ సోదరుడు సురేష్ ప్రొద్దుటూరు టీడీపీ టి కెట్ ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో టీడీపీ నేతను అరెస్టు చేస్తే, తా ను తప్ప మరెవ్వరూ ప్రొటెక్టు చేయలేకపోయారని చెప్పుకోవాలనే ఎంపీ ఇదంతా చేస్తున్నట్లు పరిశీలకులు వివరిస్తున్నారు.

ప్రొద్దుటూరు టికెట్ కోసం తీవ్రయత్నం

బీజేపీలో ఉంటూ ప్రొద్దుటూరు టీడీపీ టికెట్ కోసం ఎంపీ రమేష్ కుటుంబం ప్రయత్నిస్తోంది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉంటున్న ఆయన సోదరుడు సురేష్‌ను ఈ మారు ప్రత్యక్ష ఎన్నికల్లో నిలపాలనే తపన మెండుగా ఉంది.అందుకు కారణం లేకపోలేదు. ఎంత డబ్బున్నా పోట్లదుర్తి నాయుళ్ల బలం పోట్లదుర్తికి ఎక్కువ.. ఎర్రగుంట్ల మండలానికి తక్కువ అనే విధంగా ఉంది. ఇదే విషయాన్ని అనేక పర్యాయాలు సీనియర్ నేత నంద్యాల వరదరాజులరెడ్డి లాంటి వారు ఎత్తిచూపారు. ఈమారు పోట్లదుర్తి నాయుళ్లకు ఉన్న డబ్బుతో ఆ మాట పోగొట్టుకోవాలనే తపన రమేష్‌నాయుడు కుటుంబంలో మెండుగా ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఆ మేరకే బీటెక్ రవి వ్యవహారంలో ఛీప్ ట్రిక్స్ ప్లే చేస్తున్నట్లు పరిశీలకులు చెబుతున్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తున్న బీజేపీ సీనియర్ నేతలు సిద్ధాంతాలతో ముందుకొచ్చిన తమ పార్టీకి ఇదేం ఖర్మ అనుకుంటూ మధనపడుతున్నారు.

దివ్యాంగుల సాధికారత కోసం కృషి

- కేంద్ర మంత్రి నారాయణస్వామి
- జిల్లాలో 6509 మంది దివ్యాంగులకు సహాయ ఉపకరణాల మంజూరు



దివ్యాంగులకు ఉప కరణాలు అందజేస్తున్న కేంద్ర మంత్రి నారాయణస్వామి, చిత్రంలో కలెక్టర్ విజయరామరాజు, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: సామాన్య జనంలో దివ్యాంగులు కూడా ఒక భాగమే అని భారత ప్రభుత్వ గుర్తించిందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతశాఖ మంత్రి ఎ.నారాయణస్వామి అన్నారు.వారి అభివృద్ధి, పునరావాససేవలతో పాటు సాధికారత కోసం పాటుపడుతోందని అన్నారు. శనివారం సామాజిక్ అధికారిత షివిర్ కార్యక్రమంలో భాగంగా ఏడీఐపీ ప్రత్యేక పథకం ద్వారా అలింకో సంస్థ సౌజన్యంతో ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశంలో పోషకాహారలోపం, నిమోనియా తదితర కారణాల వల్ల బరువు తక్కువ పిల్లలు, దివ్యాంగులు జన్మిస్తున్నారన్నారు. వీటిని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. జిల్లాలో పెన్షన్లు తీసుకుంటున్న దివ్యాంగులు 50 వేల మంది ఉన్నారంటే బాధ కలిగిస్తోందన్నారు. 1960లో అలింకో సంస్థ ఏర్పడిందని, ప్రజలు చెల్లించే పన్నుల ద్వారానే దివ్యాంగులకు ఆ సంస్థ ద్వారా ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు.కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చాక దేశవ్యాప్తంగా 14,572 క్యాంపులు ఏర్పాటు చేసి ఉచిత ఉపకరణాలు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.

ఎంపీ వైఎస్ అవినాష్‌కు ప్రశంసలు

రాష్ట్రంలో ఇలాంటి క్యాంపులు ఎక్కడా జరగలేదని తెలిపారు. నిబద్ధత కలిగిన పార్లమెంటు సభ్యులు చాలా తక్కువ సంఖ్యలో ఉండడమే ఇందుకు కారణమంటూ పరోక్షంగా వైఎస్ అవినాష్‌రెడ్డిని ఆయన ప్రశంసించారు. జిల్లాలో అలింకో ప్రతినిధుల ద్వారా 42 క్యాంపులు నిర్వహించి ఉపకరణాలు అవసరమైన తొమ్మిది వేల మందిని సర్వేలో గుర్తించారని పేర్కొన్నారు. రూ. 5.85 కోట్లతో 6509 మంది దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా తొలిరోజు కడప అసెంబ్లీ నియోజకవర్గంలో 1410 మందికి వివిధ రకాల సహాయ ఉపకరణాలు అందిస్తున్నామన్నారు. ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా తన నియోజకవర్గంలో 1410 మంది దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలు అందిస్తుండడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు ఉపకరణాలు అందించే కార్యక్రమాన్ని గురించి 16 నెలల కిందట తాను కలెక్టర్‌తో చర్చించానన్నారు. ఆయన కేంద్ర మంత్రి, అలింకో సంస్థ ప్రతినిధులతో మాట్లాడి జిల్లాలో 42 క్యాంపులు ఏర్పాటు చేసి 6509 మందిని గుర్తించారని తెలిపారు. రూ. 5.85 కోట్ల విలువజేసే ఉపకరణాలు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 7 క్యాంపులు నిర్వహించి అప్లియెన్సెస్ పంపిణీ చేపడుతున్నామన్నారు. తాను ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ. 90 లక్షలు ఇచ్చానన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు అందించేందుకు ఎంపీ రూ. 90 లక్షలు ఇవ్వడం అభినందనీయమన్నారు. రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, కలెక్టర్ విజయరామరాజు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోంశాఖకు ఫిర్యాదు చేశా: ఎంపీ సీఎం రమేష్

కడప కోటిరెడ్డిసర్కిల్: టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి నిర్బంధంపై కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేశానని ఎంపీ సీఎం రమేష్‌నాయుడు తెలిపారు. కడప నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగా గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీటెక్ రవి అరెస్టు సంఘటనలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ వ్యాఖ్యలు ఏమాత్రం సమంజసం కాదని, పోలీసులు తనకు లీగల్ నోటీసు ఇస్తే తగిన సమాధానం ఇచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులపై పలు ఆరోపణలు చేశారు. సమావేశంలో బీజేపీ నేతలు వంగల శశిభూషణ్‌రెడ్డి, బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 3 నుంచి రాష్ట్రస్థాయి అగ్రిటెక్ సదస్సులు

– కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య

కడప అగ్రికల్చర్ : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, రాష్ట్ర వ్యవసాయశాఖ సంయుక్తంగా డిసెంబర్ 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు గుంటూరు లాం ఫారంలో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై రాష్ట్రస్థాయి అగ్రిటెక్–2023 సదస్సు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞానకేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఈ సందస్సులో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై 125కు పైగా ప్రదర్శన స్టాల్స్, అతిథుల సందేశాలు, రైతులు– పరిశ్రమల ప్రతినిధుల చర్చాగోష్టి, రైతులు శాస్త్రవేత్తల చర్చాగోష్టి, పంటల ఉత్పత్తి, సస్యరక్షణలో ఆధునిక విధానాలు, పర్యావరణ హిత వ్యవసాయానికి సహజ వనరుల పరిరక్షణ–యాజమాన్యం గురించి ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. వైఎస్సార్ జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని మద్దిమడుగు సమీపంలో గల డంపింగ్ యార్డు వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి(60) మృతదేహం లభించినట్లు సీకేదిన్నె ఎఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొలుములపల్లి వీఆర్ఓ చక్రధర్ తెలిపిన సమాచారం మేరకు డంపింగ్ యార్డుకు ఉత్తర దిశలో గల గుర్రంగుంపు కొండలలో ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. గత మూడు రోజుల నుంచి ఈ పరిసరాల్లో తిరుగుతూ ఉండేవాడని తెలిసిందన్నారు. మృతుడి సమాచారం తెలిసిన వారు 91211 00526, 91211 00525 నంబర్లకు తెలపాలని కోరారు.

కడపలో చోరీలపై పోలీసుల నిఘా



– సీసీ పుటేజీల ద్వారా అనుమానితుడి ఫొటో విడుదల

కడప అర్బన్ : కడప నగరంలోని శంకరాపురం, ఓం శాంతినగర్, పక్కీరుపల్లి, కడపలోని పలు ప్రాంతాల్లో ఇళ్లల్లో జరిగిన దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు అనుమానితుడి చిత్రాన్ని విడుదల చేశారు. ఈ వ్యక్తి గురించిన వివరాలు తెలిసిన వారు 912100520, 9121100521, 921100522 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

జిల్లాలో వర్షం..అన్నదాతల్లో హర్షం

కడప అగ్రికల్చర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నిత్యం జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో వర్షం కురుస్తోంది. గత నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతం అవుతున్నా సరైన వర్షం మాత్రం పడలేదు. అయితే శుక్రవారం తెల్లవారు జామున మాత్రం జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో మెట్టప్రాంతాల్లో సాగైన పంటలకు ఈ వర్షం టానిక్‌లా పనిచేయనుందని పలువురు తెలిపారు. ఈ వర్షంతో వీఎన్ పల్లె, కాశినాయన, గోపవరం, పెండ్లిమర్రి, కలసపాడు, బద్వేల్, పోరుమామిళ్ల ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏసీఏ అండర్–23

జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు షురూ

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్–23 మల్టీడేస్ అంతర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు శనివారం ప్రారంభమయ్యాయి. కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాలు వేదికగా పోటీలు ప్రారంభించారు. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో సెంట్రల్‌జోన్, సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెంట్రల్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 66.3 ఓవర్లలో 374 పరుగుల వద్ద సెంట్రల్‌జోన్ జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని ఎం. వంశీకృష్ణ 105 బంతుల్లో 6 సిక్సర్లు, 16 ఫోర్లతో 120 పరుగులు చేశాడు. ఈయనకు జతగా వసంతవర్ధన్ 69 పరుగులు, దుర్గాబాలాజీ 66 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్లు ఎస్. ఆదిల్ హుస్సేన్ 5 వికెట్లు, అఖిల్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 82 పరుగులు చేసింది. జట్టులోని టి.వంశీకృష్ణ 35 పరుగులు, యోగానంద 30 పరుగులతో క్రీజులో ఉన్నారు.



కేఓఆర్ఎం మైదానంలో తలపడుతున్న రెస్ట్ ఆఫ్ జోన్, నార్త్‌జోన్ జట్లు

ఆధిక్యంలో నార్త్‌జోన్ జట్టు..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ జోన్, నార్త్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన రెస్ట్ జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 46 ఓవర్లలో 134 పరుగుల వద్ద రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని ఎం.కె. దత్తారెడ్డి 60 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్లు శ్రీకర్ సాయిరెడ్డి 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 30 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. జట్టులోని రవికిరణ్ 54 పరుగులతో క్రీజులో ఉన్నాడు. రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్లు ఎం. చెన్నారెడ్డి 3 వికెట్లు తీశాడు. కాగా తొలిరోజు మ్యాచ్ పూర్తయ్యే సమయానికి నార్త్‌జోన్ జట్టు 28 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.



120 పరుగులు చేసిన వంశీకృష్ణ



5 వికెట్లు తీసిన ఆదిల్ హుస్సేన్

ఘనంగా అంజన్న పవిత్రోత్సవాలు



గండి అంజన్న సన్నిధిలో పవిత్రోత్సవాల హోమాలను నిర్వహిస్తున్న పురోహితులు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో కార్తీక మాసం సందర్భంగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు రెండవ రోజైన శనివారం ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు ఆధ్వర్యంలో రామానుజాచార్యులు, ఆయన శిష్య బృందంతో పాటు ఆలయ వేద పారాయణదారు రామమోహన్ శర్మలు వేదపారాయణం, యాగశాల ప్రవే శం, ద్వారా తోరణం, అగ్ని ప్రతిష్ట, లఘుపూర్ణాహుతి, గోష్టి తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలను నిర్వహించారు. పవిత్రోత్సవ కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడ్డి, చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్‌లు పర్యవేక్షించారు.

ఉత్తరప్రదేశ్ వాసి అన్నదానం

కార్తీక మాసం సందర్భంగా ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శ్రీరాంధీన్ చౌదరి అంజన్న సన్నిధిలో శనివారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అధికారి ఆయనను అభినందించారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నాం

పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు



ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డికి స్వీట్లు తినిపిస్తున్న బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటారని వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబా ఫకృద్దీన్ తెలిపారు. శనివారం ఉదయం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు గుర్తింపు హోదా ఇచ్చిన కారణంగా బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటారన్నారు. గుర్తింపు హోదాను కల్పించి గురుతర బాధ్యతను తమపై ఉంచినందుకు తమపై విశ్వాసాన్ని వమ్ము చేయకుండా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సంస్థ అభివృద్ధికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారక తిరుమలరావు, రవాణాశాఖ మంత్రి పినిపె విశ్వరూప్‌కు తమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆర్టీసీ చైర్మన్, కమలాపురం ఎమ్మెల్యేలను కలిసి స్వీట్లు తినిపించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జోనల్ నాయకులు మధుసూదన్, నాగరాజు, రెడ్డిబాషా, జిల్లా నాయకులు ఎస్‌కేఎం రెడ్డి, ధనయ్య, బీవీఆర్ రెడ్డి, కొండయ్య, కృష్ణారెడ్డి, కేవీఎస్ఎం రావు, కేసీ రెడ్డి, ఎంవీపీ రావు, లింగమయ్య, డిపో నాయకులు పీఎస్ ఖాన్, విల్సన్, బీఆర్‌కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తే కఠిన చర్యలు



విద్యార్థులను తరలిస్తున్న ఆటోలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆటోలో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న ఆటోలను తనిఖీ చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూలు పిల్లల్ని రవాణా చేసే ఆటోలలో పరిమితికి మించి రవాణా చేస్తున్నారని ఫిర్యాదులు అందాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక తనిఖీ బృందాలతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో అధిక లోడుతో విద్యార్థులను రవాణా చేస్తున్న ఆరు ఆటో రిక్షాలను సీజ్ చేశామన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముగ్గురు సామర్థ్యం గల ఆటోలలో ఆరుగురు స్కూల్ విద్యార్థులు, నలుగురు సామర్థ్యం గల ఆటోలలో 8 మంది విద్యార్థులకు మాత్రమే అనుమతి ఉందన్నారు. అలాగే స్కూల్ బ్యాగులు క్యారియర్లు మొదలైనవి ఆటో రిక్షాకు బయటవైపు వేలాడదీయరాదన్నారు. వెనుక వైపు డోరు ఓపెన్ చేసి పిల్లల్ని కూర్చోనీయరాదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంబంధిత స్కూల్ యాజమాన్యాలు శ్రద్ధ వహించి పరిమితికి లోబడి మాత్రమే ఆటోలో విద్యార్థులను పంపించాలని సూచించారు. ఈ దాడుల్లో మోటార్ వాహనాల తనిఖీ అధికారులు వై .ప్రసాద్, శ్వేత, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

నవశకం

ఇంటి వద్దకే కులధ్రువీకరణ పత్రం



నాకు ఇద్దరు కుమారులు. గతంలో వారికి కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే వీఆర్ఓలు, ఆర్ఐలు, ఎమ్మార్వో ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వైఎస్సార్ చేయూత పథకానికి దరఖాస్తు చేయాలంటే నాకు కుల ధ్రువీకరణ పత్రం కావాలన్నారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో దరఖాస్తు చేశాను. ఒక్కరోజులోనే సర్టిఫికెట్ ఇంటికే తెచ్చి ఇచ్చారు. – పి. సుబ్బులక్షుమ్మ, విలాసం బావి వీధి. రవీంద్రనగర్.

ఫేస్‌యాప్ శుభపరిణామం



ఉపాధ్యాయులు సరైన సమయానికి పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు మంచి విద్యాబోధన చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫేస్‌యాప్ ప్రవేశపెట్టారు. అలాగే నాడు–నేడు వల్ల పాఠశాలలు సమగ్రాభివృద్ధి చెందాయి. ఉపాధ్యాయులు కూడా ఉత్సాహంగా పాఠశాలకు వెళ్లి విద్యాబోధన చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పాఠశాలలు చాలా అస్తవ్యస్తంగా ఉండేవి. పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారడంతో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. – కాశీప్రసాదరెడ్డి, హెడ్మాస్టర్, వైఎంఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్, ప్రొద్దుటూరు

వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటా



నాకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. వారికి పెళ్లిల్లు అయిపోయాయి. నేను కుండలు తయారు చేసుకుని జీవనం సాగిస్తున్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకంలో భాగంగా తొండూరులో స్థలంతోపాటు సొంతింటి కల నెరవేర్చుకున్నాను. నా చిన్న కుమారుడికి కూడా జగనన్న స్థలం, ఇల్లు మంజూరయ్యాయి. జగన్‌సార్‌కు జీవితాంతం రుణపడి ఉంటాను. – చిలంకూరు వెంకటన్న, లబ్ధిదారుడు, తొండూరు మండలం

ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన అవసరం

– జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి



కడప అర్బన్ : ప్రజా వినియోగిత సేవల చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్‌లు సంయుక్తంగా పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయసేవాసదన్‌లో ప్రజా వినియోగిత సేవారంగాల్లో న్యాయసేవలపై, వివిధ శాఖల జిల్లా అధికారులకు అవగాహన, సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్మినెంట్ లోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పుతో సమానమన్నారు. 10 రకాల ప్రభుత్వ సేవలను పొందే విషయంలో ఏదైనా అన్యాయం జరిగితే తమను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పర్మినెంట్ లోక్ అదాలత్ సభ్యులు ఎం.వి సుబ్బారెడ్డి, ఎం. ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల రాజీకి కృషి చేయాలి

– డీఎల్ఎస్ఏ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్




కడప అర్బన్ : జిల్లాలో డిసెంబర్ 9న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసుల్లో రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ అన్నారు. న్యాయసేవాసదన్‌లో శనివారం మధ్యాహ్నం పోలీసు అధికారులు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో జడ్జి సమీక్ష నిర్వహించారు. ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ హేమస్రవంతి, సెకండ్ ఏడీఎం నందిని, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

చిన్నకుడాలలో ఘర్షణ : పలువురికి గాయాలు

లింగాల : లింగాల మండలం చిన్నకుడాల గ్రామంలో శనివారం ఎం.విశ్వనాథరెడ్డి, ఎరికిరెడ్డి అప్పిరెడ్డి కుటుంబాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులతోపాటు అప్పిరెడ్డి కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. ఎస్ఐ రవికుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వనాథరెడ్డికి చెందిన పశువులు అప్పిరెడ్డి ఇంటి ముందుగా వెళ్లాల్సి ఉంది. పశువుల మేతకు ఆ దారి నుంచి వెళ్లే సమయంలో అప్పిరెడ్డి ఇంటి ముందర పేడ పెడుతున్నాయని వాదన చెలరేగింది. గత నాలుగేళ్లుగా ఈ వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం ఆర్మీలో పనిచేస్తున్న అప్పిరెడ్డి కుమారుడు రామాంజనేయరెడ్డితో పాటు వారి బంధువులు విశ్వనాథరెడ్డిపై దాడి చేశారు. విశ్వనాథరెడ్డి కూడా ప్రతిదాడి చేయడంతో ఇరువురి కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. వీరిని వెంటనే పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైవీయూ స్పోర్ట్స్‌మీట్‌లో ఓవరాల్ మెన్ ఛాంపియన్‌గా కడప



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని రాయలసీమ వ్యాయామ విద్య కళాశాలలో నిర్వహించిన యోగివేమన యూనివర్సిటీ స్పోర్ట్స్ మీట్‌లో ఓవరల్ మెన్ ఛాంపియన్‌గా కడప, ఓవరాల్ ఉమెన్ ఛాంపియన్‌గా రాయలసీమ వ్యాయామ విద్య కళాశాల నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్ తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, టెన్నిస్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. వ్యక్తిగత ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కడప ఆర్ట్స్ కళాశాల విద్యార్థి సింధూర్, జమ్మలమడుగు సాయిపరమేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థి మణికంఠలు గెలుచుకున్నారని తెలిపారు. మహిళల వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ను ఆర్‌సీపీఈ కళాశాల విద్యార్థిని లక్ష్మీ గెలుచుకుందన్నారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ ఉమా మురళీధర్ బహుమతులు అందించారు. యోగివేమన యూనివర్సిటీ అధ్యాపకుడు రామప్రసాద్ రెడ్డి, మీట్ సెక్రటరీ డాక్టర్ నరసింహారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతిగృహానికి అన్ని వసతులు కల్పిస్తాం



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నిరాశ్రయుల వసతి గృహం నిర్వాహకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని జిల్లా పరిషత్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహానికి అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం జిల్లా పరిషత్‌లో జరిగిన సమావేశానికి హాజరైన ఎంపీకి నిరాశ్రయుల వసతి గృహం నిర్వాహకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఉంటున్న పాత భవనాన్ని జిల్లా పరిషత్ వారు పడగొడతామని నోటీసులు ఇచ్చారన్నారు. కొత్త భవనానికి మరుగుదొడ్లు, వంట గది, మహిళలకు వసతి లేదన్నారు. పాత భవనంలో ఉన్న గదులలో మరుగుదొడ్లను వాడుకుంటున్నామన్నారు. దీనిపై వైఎస్ అవినాష్‌రెడ్డి స్పందిస్తూ వసతి గృహానికి అవసరమైన అన్ని వసతులు కల్పించాకే పాత భవనాన్ని పడగొట్టేలా చూస్తామన్నారు. మరుగుదొడ్లతో పాటు వంట గది, మహిళలకు వసతి సౌకర్యాలను తన నిధులతో కల్పిస్తానన్నారని, ఈ కార్యక్రమంలో వసతి గృహం నిర్వాహకులు శ్రీనివాసులురెడ్డి, కేర్ టేకర్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలి నుంచి 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేయండి

నంద్యాల కలెక్టర్‌కు ఎంపీ అవినాష్‌రెడ్డి లేఖ

కడప కార్పొరేషన్ : రాజోలి రిజర్వాయర్ నుంచి డిసెంబర్ నెలాఖరు వరకూ 700 క్యూసెక్కుల నీటిని తప్పకుండా విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. శనివారం నంద్యాల జిల్లా కలెక్టర్‌కు ఆయన లేఖ రాశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాలో కేసీ ఆయకట్టు పరిధిలోని పంటలను కాపాడటం కోసం ఈ నీటి విడుదల తప్పనిసరి అని పేర్కొన్నారు. ఆళ్లగడ్డ వద్ద కేసీ కెనాల్ 27 లాక్ కింది భాగంలో పెద్ద ముడియం మండల పరిధిలోని సుద్దపల్లె, జె.కొట్టాలపల్లె, జంగాలపల్లి గ్రామాలకు సాగు, తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో, తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కూడా 8 వారాలుగా రాజోలి వద్ద 600 క్యూసెక్కులకు తగ్గకుండా నీటిని విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

బాలికా విద్య అవసరాన్ని గుర్తించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్, డీఆర్‌డీఏ పీడీలు శ్రీలక్ష్మి, ఆనంద్‌నాయక్, ఇతర అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తల్లిదండ్రులు బాలికా విద్య అవసరాన్ని గుర్తించి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్‌లు పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ స్పందన హాలులో డీఆర్‌డీఏ పీడీ అధ్యక్షతన జెండర్ ఆధారిత హింసపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం ద్వారా బాలికల బంగారు భవిష్యత్తుకు ఆటంకం కలిగించిన వారమవుతామన్నారు. తొలుత బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్ది వారిని ఎన్నుకున్న రంగంలో రాణించేందుకు ప్రోత్సహించాలన్నారు. భ్రూణ హత్యల నివారణకు కృషి చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. ఈనెల 25 నుంచి డిసెంబరు 22 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన వారిచే ప్రతిజ్ఞ చేయించారు. సీఐ హసీం, చట్టాలగురించి వివరించారు. ఈ సందర్భంగా అతిథులు బాలికల సంరక్షణ, విద్యపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ సురేష్, భారతరత్న మహిళా మండలి అధ్యక్షురాలు పార్వతమ్మ, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు రహమతున్నీసా, ఏపీడీ ప్రసాద్‌తోపాటు ఏసీలు, ఏపీఎంలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు అవకాశం

కడప కార్పొరేషన్ : విద్యుత్ వినియోగదారుల సౌకర్యం కోసం ఈనెల 26వ తేదీ సెలవు దినం అయినప్పటికీ జిల్లాలో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని జిల్లా విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్ బిల్లులు గడువులోపు చెల్లించి సంస్థ పురోభివృద్ధికి సహకరించాలని కోరారు.